నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 18 డిసెంబర్ 2024 VIKARABAD



దవాఖానలో చికిత్స పొందుతున్న వైశాలి, రక్షిత

## ఫుడ్ పాయిజన్ వల్ల ఇంకా కోలుకోని విద్యార్థినులు

**తాండూరు మాతాశిశు దవాఖానలో కొనసాగుతున్న చికిత్స**

తాండూరు, డిసెంబర్ 17 : తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన 11 మంది విద్యార్థినుల్లో వైశాలి, రక్షితలకు మాతాశిశు దవాఖానలో చికిత్స కొనసాగుతున్నది. పిల్లల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు సూచిస్తున్నా.. తల్లిదండ్రుల్లో ఆందోళన వీడడం లేదు. మళ్లీ హాస్టల్‌కు వెళ్లాలంటేనే విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. గిరిజన హాస్టల్‌లోకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మీడియాను పోలీసులు లోనికి అనుమతించలేదు.

## రెండోరోజూ కలెక్టరేట్ వద్ద ధర్నా..

**సొమ్మసిల్లి పడిపోయిన మధ్యాహ్న భోజన కార్మికురాలు**

**దవాఖానకు తరలించిన పోలీసులు**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ధర్నాలో సొమ్మసిల్లి పడిపోయిన కార్మికురాలు

ఆదిబట్ల, డిసెంబర్ 17 : పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు, గుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేలు వేతనం ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా రెండోరోజూ మంగళవారం కొనసాగింది. ధర్నాలో ఓ కార్మికురాలు సొమ్మసిల్లి పడిపోగా, పోలీసులు దవాఖానకు తరలించారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి స్కూల్‌కూ గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని, యూనిఫాంలు, గుర్తింపు కార్డులనూ అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పవద్దని కోరారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్‌ల నుంచి రుణాలను తీసుకునే సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జూలై తర్వాత అక్రమంగా నిర్మించిన ఇండ్లను

# కూల్చేస్తాం

**చెరువుల ఆక్రమణలపై కీలక ప్రకటన చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**కాముని చెరువు, మైసమ్మ చెరువులను పరిశీలించిన హైడ్రా బృందం**

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): జూలై తర్వాత కడుతున్న నిర్మాణాల్లో అక్రమమని తేలితే కూల్చేయడం తప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏర్పాటు తర్వాత అక్రమంగా నిర్మించిన ఇండ్లపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం కూకట్‌పల్లిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువులను స్థానికుల ఫిర్యాదు మేరకు కమిషనర్ రంగనాథ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కూకట్‌పల్లి మండలంలోని కాముని చెరువులో నిర్మాణ వ్యర్థాలు, మట్టిని తీసుకొచ్చి చెరువును కబ్జా చేస్తున్నారని అందిన ఫిర్యాదుల మేరకు చెరువులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. జూలై 2024 తర్వాత నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కచ్చితంగా కూల్చేస్తామని చెప్పారు. గతంలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల జోలికి కూడా వెళ్లమని, అయితే ఎలాంటి పర్మిషన్స్ లేకుండా కడుతున్న నిర్మాణాలను మాత్రం కూల్చేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటు తదనంతరం నిర్మించిన అక్రమ నిర్మాణాలను గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించి కూలుస్తామన్నారు. అలాగే ఇటీవల తీసుకున్న అనుమతులను కూడా హైడ్రా పరిశీలిస్తుందని, వాటిలో లోపాలుంటే ఆయా నిర్మాణాలను అడ్డుకుంటామని వెల్లడించారు. కాముని చెరువులో మట్టిని పోసి చెరువును కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై చట్టరీత్యా చర్యలుంటాయని తెలిపారు. చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడం తగదని, ఆ నిర్మాణాలను గుర్తించి కూల్చివేస్తామన్నారు. హైడ్రా ఏర్పాటుకు ముందు నిర్మించిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని, వాటిని కూల్చేది లేదని ఆయన స్పష్టం చేశారు. కానీ, ఈ నిబంధన వాణిజ్య సముదాయాలకు వర్తించదన్నారు. చెరువుల సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను రంగనాథ్ ఆదేశించారు. చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాముని చెరువులో వెలిసిన రాఘవేంద్ర కాలనీలో పాత ఇండ్లపై చర్యలు ఉండవని, ఇటీవలే కొందరు అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై చర్యలు ఉంటాయన్నారు. చెరువు కబ్జాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసి, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలన్నారు. కాముని చెరువు, మైసమ్మ చెరువు పరిసరాల్లోని నివాసితులు చెరువులు కబ్జా కాకుండా చూడాలని స్థానికులను కోరారు.



కూకట్‌పల్లిలో కాముని చెరువు, మైసమ్మ చెరువులలో ఆక్రమణలపై స్థానికులు, అధికారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



చేవెళ్ల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కడ్తాల్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన అనంతరం రైతుకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్తున్న ఫొటోలను చూపుతూ నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాల అందజేత**

**లగచర్ల రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్**

**కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై దద్దరిల్లిన నినాదాలు**


**నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు**

## అక్రమ కేసులపై

# ఆగ్రహ జ్వాల

ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు లాక్కునే ప్రయత్నం చేసిన అధికారులపై తిరగబడిన లగచర్ల గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళ వారం ఉమ్మడి జిల్లా నిరసనలతో హోరెత్తింది. ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందజేసి, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నినదించారు. 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం..'.. 'చూపిస్తాం.. చూపిస్తాం రైతుల తడాఖా చూపిస్తాం..' 'కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలుపుదాం..'.. 'ప్రజాపాలనంటరు.. ప్రజలనే పీడిస్తరు..'.. అన్న నినదాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిన్నంటాయి. ఈ సందర్భంగా పలువురు మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ లగచర్ల రైతుల జీవితాలతో చెలగాటమాడడం వల్ల వారి బతుకులు మగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల ఆర్తనాదాలు కాంగ్రెస్ ప్రభుత్వ చెవికి వినిపించడం లేదా.. అని ప్రశ్నించారు. నిత్యం రెక్కలు ముక్కలు చేసుకుంటున్న రైతుల జీవితాలను బుగ్గిపాలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమా అంటూ మండిపడ్డారు. అనారోగ్యంగా ఉన్న రైతుకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లిన తీరును చూస్తే గుండెలు మండిపోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్య కాండను ఇక సహించేది లేదని హెచ్చరించారు. అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిన లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

- వికారాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ)



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ శ్రేణులు

## లగచర్ల కేసులో బెయిల్ రాకుండా ప్రభుత్వ కుట్ర

**-పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**



పరిగిలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

పరిగి, డిసెంబర్ 17 : లగచర్ల ఘటనకు సంబంధించిన కేసులో మాజీ ఎమ్మెల్యే, రైతులకు బెయిల్ కూడా రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పరిగిలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. కేసు నమోదై 35 రోజులు గడిచి, మాజీ ఎమ్మెల్యే, రైతులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినా పోలీసులు చార్జీషిట్ వేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. లగచర్ల ఘటనపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు, మహిళా కమిషన్‌లకు ఫిర్యాదు చేయగా, వారు సందర్శించి.. రైతులకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న రైతుకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లడం సరైంది కాదన్నారు. లగచర్ల ఘటనపై చర్చిద్దామంటే కాంగ్రెస్ సర్కార్ పారిపోతున్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు మేడిద రాజేందర్, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, వెంకటయ్య, రాములు, ప్రవీణ్, నల్క జగన్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కె.వెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బి.రవికుమార్, గౌస్‌పాషా, శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

## దుర్మార్గ పాలన దేశంలో ఎక్కడైనా ఉన్నదా ?

**- మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్**

షాద్‌నగర్, డిసెంబర్ 17 : ఫార్మా కంపెనీల పేరుతో పేదల భూములను గుంజుకునేందుకు యత్నించడంతో పాటు రైతులపై అక్రమ కేసులు పెట్టే దుర్మార్గ పాలన దేశంలో ఎక్కడైనా ఉన్నదా.. అని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ ప్రశ్నించారు. లగచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసనను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాలేదు కానీ.. రైతులను ఇబ్బంది పెట్టడం వారికే చెల్లిందన్నారు. అత్తెసరు రుణమాఫీలు చేసి ఏదో ఘనకార్యం చేసినట్లు జబ్బలు చరుచుకుంటున్నారని విమర్శించారు. రేపుమాపంటూ పెట్టుబడి సాయాన్ని ఎప్పుడిస్తారో తెలుపకుండా దాటవేస్తున్న కాంగ్రెస్‌కు రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్, నాయకులు వంకాయల నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, రామకృష్ణ, ఎంఎస్. నటరాజన్, లక్ష్మణ్‌నాయక్, వై. రవీందర్‌యాదవ్, రాజ్యలక్ష్మి, ఉమాదేవి, దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, మన్నె నారాయణ, వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఈగ వెంకట్రాంరెడ్డి, కిశోర్, పినమోని గోపాల్, పిల్లి శేఖర్, అడ్డు, శివ, వీరేశం, రవిగౌడ్, సలీం, అయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు

## రైతులను బేషరతుగా విడుదల చేయాలి

**బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్**

వికారాబాద్, డిసెంబర్ 17 : అరెస్టు చేసిన లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల రైతు హీర్యానాయక్‌కు గుండె పోటు వస్తే అతడికి బేడీలు వేసి దవాఖానకు తీసుకుపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అక్కడున్న ఇద్దరు చిన్న ఉద్యోగులను సస్పెండ్ చేయడం సరికాదని, ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలను గాలికి వదిలేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నోరు పారేసుకోవడంతోనే సంవత్సర కాలం గడిపారని మండిపడ్డారు. ఇచ్చిన 6 గ్యారెంటీలను ఇప్పటి వరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అవస్థలు పడుతుంటే సంబంధిత అధికారులను పంపించి తూ.తూ మంత్రంగా తనిఖీలు చేయించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులతో చర్చించేందుకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, గోపాల్, రామస్వామి, కృష్ణ, సీనియర్ నాయకులు మేక చంద్రశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, మైనారిటీ నాయకులు గయాజ్, గఫార్, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యయ్య గౌడ్, అశోక్, లక్ష్మణ్, మల్లేశం, మంచన్ పల్లి సురేశ్, రాజేందర్ గౌడ్, కృష్ణ, గాండ్ల మల్లికార్జున్, సంగమేశ్, శ్రీనివాస్ గౌడ్, సుభాశ్, మంగలి రవి, మహిపాల్, ఉపేందర్ రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.